క్లుప్తంగా

అధ్యక్షుడిగా శ్రీనివాస్



శాయంపేట : బోరింగ్ మెకానిక్‌ల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బాసాని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి రాజ్‌కుమార్, ఇమ్మడి కనకయ్య, ప్రధానకార్యదర్శిగా రావుల స్వామి, సహాయ కార్యదర్శిగా కర్ణ సుధాకర్, సహాయ కార్యదర్శులుగా ఆరిఫ్, పంజాల రవీందర్, కోశాధికారిగా కన్నం సదానందం, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్, కోటి, పవన్, చంద్రయ్య, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరం



శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో కాజీపేట సీఎస్సీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం లేబర్‌కార్డు కలిగిఉన్న కార్మికులకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది కిశోర్, అనిల్, రాజశేఖర్, సందీప్ తెలిపారు. సుమారు 40 మంది కార్మికులకు రక్త, మూత్ర పరీక్షలు, ఈసీజీతో పాటు 8 రకాల పరీక్షలను నిర్వహించిట్లు తెలిపారు. టెస్ట్ రిపోర్టులను త్వరలో అందిస్తామని తెలిపారు. కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

కడియం కావ్యను గెలిపించాలి



వేలేరు : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కుడా మాజీ డైరక్టర్ బిల్లా యాదగిరి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న పథకాలు చూసి కావ్యకు ఓటు వేయాలని కోరారు. త్వరలోనే రైతు రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు.

సంజయ్‌ను విమర్శించడం సరికాదు

కమలాపూర్ : జమ్మికుంటలో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి భూపతి ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవప్రదమైన సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి, మంత్రి పదవిలో ఉన్న పొన్నం ప్రభాకర్ ఇష్టానురీతిగా మాట్లాడడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. మాట్లాడే తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

సీతారాంనాయక్ గెలుపునకు కృషి చేయండి

నర్సంపేట : మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ తరఫున బరిలో నిలిచిన అజ్మీరా సీతారాం నాయక్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పట్టణ కమిటీ మాజీ అధ్యక్షుడు బాల్నె జగన్ కోరారు. ఈ మేరకు 153వ బూత్ అధ్యక్షుడు రమేశ్ పాండ్య ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రధాని మోదీ పేదల ఉన్నతి కోసం అహోరాత్రులు శ్రమిస్తున్నారని చెప్పారు. కేంద్రంలో మరోసారి పార్టీ అధికారంలోకి వచ్చి మోదీ ప్రధాని అయితే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి మరింతగా బాటలు పడతాయని తెలిపారు. బీజేపీ చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని శ్రేణులకు సూచించారు. సీతారాంనాయక్‌కు ఓటేసి సుపరిపాలనకు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చిన్న రవీందర్ సింగ్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, పట్టణ ఉపాధ్యక్షులు కందగట్ల నాగరాజు, కనుక గణేశ్, నితీశ్‌తో పాటు , తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

గీసుకొండ : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్ ఇటీవల యూపీఎస్సీ ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం శాలువాతో సన్మానించారు. యూపీఎస్సీ ఫలితాల్లో ర్యాంకు సాధించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, మాజీ సర్పంచ్‌లు పూంద్రు జయపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, నాయకులు ముంత రాజయ్య, డోలె చిన్ని, కిరణ్ తండ్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : గూడూరులో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కమలాపూర్ : ర్యాలీ తీస్తున్న కార్మికులు



పరకాల : మే డే వేడుకల్లో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

కార్మికులకు అండగా ఎర్రజెండా

కార్మికులకు ఎర్రజెండా అండగా నిలుస్తోందని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ కూడళ్ల వద్ద ఎర్రజెండాలు ఆవిష్కరించి నినాదాలు చేశారు. కార్మిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, కార్మిక హక్కులను హరించే ప్రభుత్వాలపై ఉద్యమిస్తామని అన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



ఎల్కతుర్తి : ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..



ఐనవోలు : నినాదాలు చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు



ధర్మసాగర్‌లో..



శాయంపేటలో..



దామెర : ఒగ్లాపూర్‌లో నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



దామెర : విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ ఈ–టెక్నో పాఠశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన పదోవతరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు, ఉత్తమ ఫలితాలు సాధించగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ర్యాంకర్లను అభినందించారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన మట్ట ప్రణీత్, భూమ యశ్వంత్, మిట్టపల్లి శ్రీకాంత్, జాడి భావ్యను అభినందించి పలు సూచనలు చేశారు. లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎంచుకున్న లక్ష్యం మేరకు కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ముఖ్య సలహాదారులు డి. మల్లయ్య, సదయ్య, బి. లక్ష్మీనివాసం, కరస్పాండెంట్ డి. శోభారాణి, డైరెక్టర్లు రాకేష్‌భాను, దీనేష్‌భాను, విద్యార్థులతో పాటు తదితరులు ఉన్నారు.

నేడు మానవహారం

పరకాల : స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 8గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం చేపట్టనున్నట్లు ఆర్డీఓ నారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏడీఈ దేవేందర్

దామెర : విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పరకాల సబ్ డివిజన్ ఏడీఈ దేవేందర్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెగిన విద్యుత్ తీగలను, వర్షంలో కరెంటు స్తంభాలను తాకవద్దని అన్నారు. అనుమతిలేని వ్యక్తులు డీటీఆర్(ట్రాన్స్‌ఫార్మర్) ఫ్యూజులు వేసే ప్రయత్నం చేయవద్దని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అన్నారు. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి ఫోన్ మాట్లాడొద్దని, కరెంటు లైన్ల కింద ఇళ్లు, పందిళ్లు, జెండా గద్దెలు నిర్మించవద్దని పేర్కొన్నారు. జంతువుల నుంచి పంటను రక్షించే క్రమంలో విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దని, అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ గుర్రం రమేష్, సబ్ ఇంజనీర్ చందన, లైన్‌ఇన్స్‌పెక్టర్లు రవీందర్, వేణుగోపాల్, లైన్‌మెన్లు మనోహర్, సురేష్, రవీదంర్, జేఎల్ఎంలు రమేష్, కృష్ణ, రాజశేఖర్ మరియు అన్‌మ్యాన్డ్ వర్కర్లు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏడీఈ, ఏఈ

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



అవగాహన కల్పిస్తున్న బీసీఐ క్షేత్ర సిబ్బంది

ఎల్కతుర్తి : మండలంలోని రైతులు భూసార పరీక్షలు చేయించాలని బీసీఐ క్షేత్ర సిబ్బంది సూచించారు. ఈ మేరకు బుధవారం తిమ్మాపూర్ గ్రామంలో బీసీఐ ఉత్తమ పత్తి యాజమాన్య పథకం నవ కాంత్రి, కేశవాపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీఐ సిబ్బంది రఘు, మౌనిక, లత పలు సూచనలు చేశారు. రైతులు భూసార పరీక్షలు చేయించి నేల ఆరోగ్య స్థితి తెలుసుకుని సాగు చేయాల్సిన పంట, ఉపయోగించాల్సిన ఎరువులను తెలుసుకోవాలని అన్నారు. భూసార పరీక్ష చేయడం ద్వారా నేలలో ఉన్న నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం వంటి స్థూల పోషకాల సామర్థ్యం తెలుస్తుందని, వాటి ఫలితాల ఆధారంగా శాస్త్రవేత్తలు సూచించిన ఎరువులను మోతాదులో ఉపయోగించాలని రైతులకు సూచించారు. గురువారం నుంచి పదిరోజుల పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో భూసార పరీక్షను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. కాగా తిమ్మాపూర్‌లో 50మంది రైతులకు చెందిన భూమిలో భూసార పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రైతులు పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఐనవోలు : మండల కేంద్రంలో ఇటీవల ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా వారి ఆత్మహత్యలకు గల కారణాలను విశ్లేషించేందుకు మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఇద్దరు సభ్యులతో కూడిన నిజనిర్ధారణ కమిటీ మండల కేంద్రంలో బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి ఆత్మహత్యలకు గల కారణాలను తెలుసుకుని నోట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంత్ కుటుంబ సభ్యులకు రూ.10లక్షల ఆర్థికసాయంతో పాటు అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే రైతులకు కావలసిన ఎరువులు, పురుగుల మందులను ప్రభుత్వం సబ్సిడీపై అందించి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిజనిర్ధారణ కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న దిలీప్, రాజు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలో గల విద్యానికేతన్ జూనియర్ కళాశాలలో 1996–98 సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాల రోజుల జ్ఞాపకాలను నెమరు చేసుకుంటూ సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం నాటి అధ్యాపక బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధన్‌పాల్, రంగారెడ్డి, జైపాల్, రవీందర్, అరుణ, విజయకుమారి, పూర్వవిద్యార్థులు జంబు రవీందర్, పుట్ట నవీన్, రూప, క్రిస్టఫర్, కొత్తపల్లి రవీందర్, కనకం రమేశ్, రవికుమార్ పాల్గొన్నారు.

యాసంగి ధాన్యం కొనుగోళ్లకు రెడీ

- మండల వ్యాప్తంగా 5,600 ఎకరాల్లో వరి సాగు
- ప్యాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోల కేంద్రాల ఏర్పాటు
- మద్దతు ధర కల్పించాలని రైతుల వేడుకోలు

నడికూడ : మండల వ్యాప్తంగా యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఉండగా, రామకృష్ణపూర్, నడికూడ, చౌటుపర్తి, రాయపర్తి, నార్లపూర్, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో మరికొన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఎండ తీవ్రత పెరడడంతో పాటు, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో, చెరువుల్లో, వ్యవసాయ బావుల్లో నీరు లేక సుమారు 800 నుంచి 1,000 ఎకరాల్లో పంట దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో 5,600 ఎకరాల్లో యాసింగి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 26 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని లెక్కలు వేస్తున్నారు. గతేడాది యాసంగితో పోలిస్తే ఈసారి ఎకరాకు 10 నుంచి 15 బస్తాల ధాన్యం తక్కువ సాగు అయ్యిందని, పెట్టుబడి రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు వస్తుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీసారి ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు తరుగు పేరిట మూడు నుంచి నాలుగు కిలోల మేర కట్టింగ్లు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. వరికి మద్దతు ధర పెంచకపోవడంతో పెట్టుడి కూడా చేతికి రాలేని పరిస్థితి ఉందని, అప్పుల పాలవుతూ దిక్కుతోచని స్థితిలో ఉన్నామన్నారు. తరుగు పేరిట కట్టింగ్లు చేయొద్దని, మద్దతుతో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సాగు నీరు అందక పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



స్థలాలు లేక రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులు



రైతు ఇంటిముందు ధాన్యం రాశులు

మద్దతు ధర పెంచాలి



రాష్ట్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలి. గతేడాది కంటే ఈసారి పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. సాగునీరు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి. సాగునీరు అందకపోవడంతో పంట నష్టపోయిన రైతులను కూడా ఆదుకోవాలి

- ఊర శ్రీనివాస్‌రావు, రైతు, నడికూడ

రెజ్లింగ్ శిక్షణను వినియోగించుకోవాలి

దామెర: రెజ్లింగ్ శిక్షణను విద్యార్థులు, యువకులు వినియోగించుకోవాలని కోచ్ ప్రియతమ్ కోరారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మండలంలోని తక్కళ్లపహాడ్ పాఠశాలలో బుధవారం ఉచిత రెజ్లింగ్ శిక్షణ క్యాంప్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. రెజ్లింగ్ క్రీడలో రాణించే క్రీడాకారులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన అన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

దామెర: అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. మండలంలోని ముస్త్యాలపల్లి శివారులో కొందరు జేసీబీతో మట్టి తవ్వకాలు చేపట్టి టిప్పర్లతో తరలిస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న ఆయన సిబ్బందితో కలిసి వాటిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సంబధిత వాహనాల యజమానులపై కేసులు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

కమలాపూర్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్ అన్నారు. కమలాపూర్, మర్రిపల్లిగూడెంతో పాటు మండల పరిధిలోని ఆయా పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బూత్ లెవెల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.



కమలాపూర్ : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్

సెలవు ప్రకటించకపోవడం సరికాదు

శాయంపేట : కార్మిక దినోత్సవం సందర్భంగా ఉపాధి కూలీలకు సెలవు ప్రకటించకపోవడం సరికాదని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్, బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మగ్గం సుమన్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని నాగసముద్రం చెరువులో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కూలీలకు సెలవు ప్రకటించకపోవడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగస్తులకు వేతనాలతో కూడిన సెలవును ఎన్నికల కమిషన్ ప్రకటించినట్లు గుర్తు చేశారు.



మాట్లాడుతున్న సుమన్

బీజేపీ సర్కారును మరోసారి ఆశీర్వదించాలి

పరకాల: కేంద్రంలో మరోసారి మోదీ సర్కారును ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి, 21వ వార్డు కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్ లాల్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 21వ వార్డులో బుధవారం ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించి మాట్లాడారు. మరోసారి కేంద్రంలో మోదీ సర్కార్ ఉండాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు శారద, పోలింగ్ బూత్ అధ్యక్షుడు నర్సింగరావు, శికరి జితేందర్, సాయి కుమార్, వాసు, పాండ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఇంటింటి ప్రచారం

ఐనవోలు : మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాదిగలకు అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటువేసి గెలిపించాలని ఎమ్మార్పీఎస్ పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బొక్కల నారాయణ పిలుపునిచ్చారు.